# తూకం రాళ్ళు

శీలా వీర్రాజు

"అప్పుడే ఏం తొందరొచ్చిపడిందీ స్కూల్లో కూసున్న పిల్లదాన్ని సూడకుండ ఎల్లిపోతున్నావ్" అంది సేవకుడి పెళ్ళాం.

సేవలతో ధనుస్సులా వొంగిపోయిన సేవకుడు ఆ మాటల్ని వినీ విననట్టే వెళ్ళిపోయాడు. వెళ్ళి వెళ్ళి తన జీవితంలో ఎక్కువ భాగం ఖర్చయిపోయిన ఓ భవంతి ముందు ఆగాడు.

అక్కడ—

వరండాలో పడక్కుర్చీలో అధికారి కూచున్నాడు. బంగారం పన్ను కట్టించుకున్న అధికారి, ఆ పంటికింద లంక పొగాకును కసిగా కమ్ముతూ అసహనంతో అటూ యిటూ చూస్తున్నాడు. ఆ చూపుకు గుచ్చుకుపోయి ఎరలాగ మెలికలు తిరిగి పోయాడు వానపాము లాటి సేవకుడు.

"ఏరా! యింతాలస్యం అయ్యిందేం?" అధికారిలో అధికారం గాలి కొట్టిన రబ్బరు బంతిలాగ, బండకేసికొట్టుకున్న కెరటంలాగ, కారుకింద పడ్డ కుక్క పిల్ల వొంట్లో విశ్వాసం నిండిన రక్తంలాగ తుళ్ళింది.

"ఇంటికాడ పనడ్డదండి." చేతులుకట్టుకున్న సేవకుడూ, సేవకుడి ముఖంలో తప్పు చేసిన బాధా, బాధకి రెప రెపలాడిపోతున్న మనసూ, మనసు లోంచి కప్పలా బెక బెకలాడుతోన్న విశ్వాసమూ—

ఏం లాభం! విశ్వాసం గొంతు పిసికేస్తూ తిరుగులేని తర్కం. "అయితే యిక్కడ పని లేదన్న మాట?"

సేవకుడు వొంగిపోయిన నడుం తడుముకున్నాడు. మాట సరిగా విని పించదేమోనని నిటారుగా నిలుచోబోయాడు గాని అతనిగూని శరీరం నిలచో లేక మళ్ళీ వొంగిపోయింది. ఆ వోంగిపోవడమే ఒక విధంగా మంచిదైంది. అధికారి ముఖం కనబడక, అరిగిపోయిన చెప్పుల్లో తన పాదాలు తనకే కని పించి, ఆ ప్రక్కనే మెల్లగా పాకుతూ వస్తోన్న తేలు కంటబడి, చప్పున చెప్పుతో దాన్ని అణిచేశాడు.

"మాట్లాడవేంరా బెల్లం కొట్టిన రాయిలాగ ?"

—అధికారం జూలు విదిలించింది. పండిపోయిన తలేమో రెండు తెల్లటి వెంట్రుకలు కిందపడ్డాయి.

"మా పిల్ల సవర్తాడిందండి. అందుకని...." వాక్కాయలు తిని వగ రుతో కంఠం పట్టేసినట్టు సేవకుడు గొంతులో కఫాన్ని మళ్ళీ లోపలికే మింగేశాడు.

అధికారం, బొచ్చుకుక్కలాగ తటాలున కుర్చీలోంచి దూకి మళ్లీ అంత లోకే యజమాని వొళ్ళోకి చేరినట్టు కుర్చీలో దర్జాగా కూచున్న అధికారి భుజం ఎక్కి మీసాలు పట్టుకుని ఉయ్యాల ఊగి ఆడుకుంటూ వుండిపోయింది.

అధికారి కరుణించాడు.

"సర్లే. లోపలికెళ్లి పని చూసుకో, ఆఁ మర్చిపోయాను, అబ్బాయితో నువ్వూ వెళ్లి భోజనాలవీ లిస్టు ప్రకారం చెప్పు."

సేవకుడు కాలు కదిపి మళ్ళీ తీసినచోటే వుంచాడు. చావకుండా యింకా ప్రాణంతో గింజుకొంటోంది తేలు. అ వొంటి కాలు మీదే బలమంతా మోపి దాన్ని పచ్చడి చేసి లోపలకు వెళ్ళిపోయాడు.

ఆ రాత్రి యింటికి పోయాక సేవకుడు కిరసనాయిలు బుడ్డీ దీపం ముందు తన దొంగతనాన్ని పెళ్ళానికి చూపించాడు. సేవకుడిలో దొంగతనం చేసి నందుకు పశ్చాత్తాపం లేదు. బాధలేదు. చాలా సంతోషంతో, గర్వంతో పెళ్ళా నికి చూపించాడు.

పెళ్ళాం కళ్ళు మెరిసాయి,

ఆ నాలుగు మిఠాయి వుండల్లోనూ, ఒకటి చటుక్కున తీసుకుని నోట్లో వేసుకుని పలబారి, సగం కతుక్కుని, మిగతా సగం మింగి, త్రేన్చి, బాగున్నాయ్ అన్నట్టు చూసింది.

ఆ మెప్పంతా గొప్పగా తనే అందుకుని 'మరేవనుకున్నవేటి!' అన్నట్టు అచ్చం అధికారిలాగే చూశాడు సేవకుడు.

అక్కడి విశేషాలన్నీ చెప్పాడు. అధికారి యింటిదగ్గర పోర్లి వాంటికి అంటించుకొచ్చిన విశేషాలన్నీ పెళ్ళాం ముందు దులిపి ఉడుతా భక్తిని తన సేవాభావాన్ని ప్రకటించుకున్నాడు.

"అరికేటయ్యా, డబ్బున్నవోరు, ఆలాటోళ్ల సెయ్యకపోతే మనం టోళ్ల సేత్తవా. పిల్ల శ్రీరోజుని మా తమ్ముడ్ని గూడ పిలుద్దరేటి" అంది సేవకుడి సేవకురాలైన ఆడది.

అధికారి మూడ్‌లోంచి మాట్లాడుతోన్న సేవకుడికి ఆ కోరిక; ఏనుక్కి చీమా, కొండమీదోడికి బండమీదోడూ, కోటీశ్వరుడికి ముష్టిదవా కనిపించినట్టు అతి అల్పంగా, పట్టించుకోవలసిన అవసరంలేనంత చిన్నదిగా అనిపించింది.

అచ్చం అధికారిలాగే సేవకుడూ తలవూపాడు.

ఊపినతల, పని చేయించిందీ లేనిదీ చెప్పడం అనవసరం అధికారి చెప్పినపని చేయడమే తప్ప, తన మనసు చెప్పినపని చేసుకోవడం సేవకుడు ఎప్పుడో మర్చిపోయాడు. తన వ్యక్తిత్వాన్ని ధనుస్సులా వంచి, సేవ అనే తాటితో బిగించాడు. ఎప్పుడైనా ఆ తాటిని సడలించినా, ఏళ్ళకొద్దీ వంగి వుండడం అలవాటైన వింటి బద్ద నిటాగ్గా రావడానికి వప్పుకోదు.

అయిదేళ్ళ తర్వాత సేవకుడు నిజంగానే నడువంతా వంగిపోయి కిందకే తప్ప పైకి చూడ్డం మర్చిపోయాడు. అధికారికి అది చాల తృప్తి నిచ్చింది తన ప్రత్యక్షంలోనూ, పరోక్షంలోనూ తనంటే అణిగి మణిగి వుండే వాళ్ళంటే

అధికారికి పుట్టినరోజు జరుపుకున్నంత ఆనందం. అందుకే అధికారి సేవకుడ్ని తొలగించలేదు.

ఒకసారి ఆకాశమూ, గాలీ హాయిగావున్న సమయం చూసుకుని అధికారి ముందుకు వెళ్లి సేవకుడు వంగున్నాడు. అధికారి వింటున్నదీ లేనిదీ సేవకుడికి కనిపించదు కనుక. వింటున్నాడనే భావించి తనలో తనే మాట్లాడుకొంటునట్టు మొదలెట్టాడు సేవకుడు. పైగా అధికారి ఆరు మెట్లున్న వరండా మీద నుంచున్నాడు. సేవకుడు నేల మీదున్నాడు.

"బీదోణ్నండి బాబుగోరో. మా కుటుంబవంతా మీ వుప్పుతినే బతుకుతున్నాం గదండే. మీరు మా రాజులు. మీరనే పోతే నేనూ, నా పెళ్ళాం, పిల్లా సచ్చిపోయ్యేవోళ్ళం. ఉప్పుడుదాక కాపాడుకొచ్చారు మా సెర్మం వొలిసి సెప్పులు కుట్టిచ్చినా మీ రుణంత్తీర్దు. భగమంతుడు మీలాటోల్ని సల్లగ సూడాలి బాబయ్యా.........."

లంక పొగాకు చుట్ట యిస్తోన్న ఆనందంలో పట్టీలు కొడ్తోన్న అధికారి, అంత ఎత్తు మీంచి ఓసారి గెద్దలాగ కిందున్న సేవకుడ్ని చూశాడు. ఆ చూడ్డం గెద్దలాగే చాలా సునిశితంగా, సూటిగా చూశాడు.

సేవకుడికి ఆ చూపులేవీ కనిపించలేదు. అసలు ఆగనుకూడా ఆగ లేదు. తన ధోరణిలో తను చెప్పుకుపోతున్నాడు.

"................మా లచ్చికి పెళ్ళి సేసెయ్యమని మా యింటివిలోజూ పోరెట్టి సంపేత్తన్నాదండి. నాకాడ డబ్బేదండి బాబయ్యా సెయ్యడానికి మా బామ్మర్దికిద్దారంటే ఆడు వొట్టి తాగుబోతు ఎదవై పొయ్యాడండి దాన్ని బైటోడికే యిద్దారనుకున్నానండి. తవరే సాయం చెయ్యాలి బాబుగోరో. ఐదొందలిప్పిత్తే సంబంధం సూసి పెళ్ళయిపోయిందనిపిచ్చేత్తానండి."

అధికారి చుట్టని అవతలకి విసిరి పారేశాడు. అతనికి, సరిగ్గా పదిరోజుల క్రితం పెళ్ళి చూపులకని అమ్మాయిని చూడ్డానికివచ్చి, అన్నీ నచ్చి కట్నం దగ్గర పేచీ వచ్చిందని వచ్చిన దారంటే వెళ్ళిపోయిన విశాఖపట్నం సంబంధం

గుర్తొచ్చింది. అధికారికి కర్మ సిద్ధాంతం మీద నమ్మకం ఎక్కువ. ఈ మధ్య చేసేందుకు పనేమీలేక కాలక్షేపానికి భగవద్గీత చదవడం మొదలెట్టాడు. వచ్చిన సంబంధం వెనక్కి జారుకున్నప్పుడు అధికారి కూతురుతో కర్మ సిద్ధాంతం గురించి మాట్లాడబోతే ముఖం మాడ్చుకుంది కూతురు.

"చూడ్రా అబ్బిగా. నీ కూతురికి పెళ్ళి కాలేదని వొట్టినే బెంగెట్టుకు ఛస్తా వెందుకు, అయ్యే రోజొస్తే ఆగమన్నా ఆగదు. మనం ఎన్ని ప్రయత్నాలు చేస్తే మాత్రం లాభమేమిటి. దాని రాతలో ఎప్పుడు రాసి పెట్టుందో. డబ్బుంచేనే అవుతుంది, లేకపోతే కాదూ అని అనుకోకు. మా అమ్మాయి సంగతే తీసుకో. డబ్బుకి కొదవ లేదుకదా. చదువు కూడా వుంది. అందం మాట సరే సరి. మరి యిన్ని సుగుణాలూవుండి కాలేదంటే ఏమనుకోవా లంటావ్? దానికి మనం బాధ్యులమా. విధి కలిసిరాలేదనుకోవాలి. అంతే. ఇంతకీ కళ్యాణం వచ్చినా, కక్కొచ్చినా ఆగదని మన పూర్వులు చెప్పనే చెప్పారు. వినలేదట్రా.........."

వినకపోవడమేమిటి. రోజూ పెళ్ళాం ఎదుట ఆ మాటే అంటున్నాడు సేవకుడు. కాని పెళ్ళాం పూర్వుల మాటని ఖాతరు చెయ్యడం లేదు మరి!

సేవకుడికి నడుంలాగి అక్కడ్నుంచి కదలి వెళ్ళిపోయాడు. అంతసేపు తను అలా నుంచోవడం తను చెయ్యాల్సిన పని తప్పించుకు తిరగడానికి కాదని అధికారికి చూపిస్తున్నట్టు అబ్బాయిగార్ని ఎత్తుకుని ఆడించాడు.

అధికారికి, వొచ్చే ఎన్నికల్లో యీ గొర్రెల మందని తన వెనకే నడిపించగలనన్న ధీమా కలిగింది. తన మాటలమీద తనకే నమ్మకం లేనంత విశ్వాసం కలిగింది.

ఆ సంతోషంలో అధికారికి సేవకుడి మీద గురివింద గింజంత ఎత్తు జాలి కలిగింది. కాని సేవకుడి గూని నడుం మీద గురివింద గింజ నిలబడలేదు. జారిక్రిందపడిపోయింది. సేవకుడికిమగనలుసుంటే యిచ్చిన డబ్బు ఎప్పటికైనా రావచ్చునన్న ఆశ వుండేది. కాని ఆ ఆశ లేదు. ఆ ఆశ లేకపోయాక డబ్బు తీసుకెళ్ళి గంగలో పోసినట్టే. గంగలో పోస్తే యింకా పుణ్యమైనా రావొచ్చు.

గోదావరి బ్రిడ్జికూడా. కృష్ణా బ్రిడ్జిమీదా రైలుపోతుంటే నదిలోకి చిల్లర పైసలు విసిరి పుణ్యం పోగుచేసుకునే నిజమైన భక్తులు ఎంతమందో! పైసకే అంత పుణ్యం వస్తే అయిదొందల రూపాయలకీ అయిదొందలూ యింటూ వొందా యింటూ పైసంత పుణ్యం వొస్తుంది కదా.

అధికారికి యీ మధ్య పుణ్య చింతన ఎక్కువయ్యింది. ఆంజనేయులు స్వామికీ, ఆరడుగుల కాంగ్రెసు కంచు మంత్రిగారికీ, ఆ పేటలో శివాలయం వద్ద శివరాత్రికి సాని సంస్కారి, చింతామణి నాటకాలు వేయించటానికీ, బల్వంత రాయ్ విధికీ ఉదారంగా దానం చేశాడు. కాదనుకుంటే విరాళమిచ్చాడు. ఆమధ్య తిరుపతి వెళ్ళినప్పుడు అంతా చూస్తుండగా జేబులోంచి గుప్పెటతో ఏదో తీసి డబ్బీలో వేశాడు. కూతురికి పెళ్ళాయ్యాక తిరుపతికి దంపతులిద్దర్నీ పట్టు కొస్తానని మొక్కుకున్నాడు. బట్ట తలమీద పాతికకన్న ఎక్కువ లేకపోయినా ఆ పాతిక తల నీలాల్నీ స్వామివారికి అర్పించేస్తాననుకున్నాడు.

కాని ఏం లాభం!

ఓరోజు అధికారి పడక్కుర్చీకోడు విరిగిపోయింది. కసికొద్దీ విసురుగా దానిమీద కూచోబోతే తాతల కాలంనించి వస్తోన్న అధికారి ఆసనం కాలిరిగి కుంటిదై పోయింది. సేవకుడ్ని పంపించి వడ్రంగి వీరన్నని పట్టుకురమ్మన్నాడు.

'అల్లా ఆ పురుషోత్తం గారింటి కెళ్ళి అమ్మాయి అక్కడ వుందేమో చూసిరారా' అని కూడా పని పురమాయించాడు.

సేవకుడికి వడ్రంగి వీరన్నయితే దొరికాడుకాని అమ్మాయిగారు మాత్రం దొరకలేదు.

అధికారి కాలు విరిగిన కుర్చీకి అతుకు వేయించుకుని కూచున్నాడు గాని ఆ పూర్వపు ఠీవేదీ, ఆ అందమేది, ఆ చందమేదీ.

అధికారికి వడ్రంగి వీరన్నమీద కోపం వచ్చింది. తెమ్మనంత మాత్రం చేత ఆ చేతకాని వెధవనే పట్టుకొచ్చిన సేవకుడిమీద కోపం వచ్చింది. అమ్మాయిగార్ని వెతకటానికి వెళ్ళి కనిపించలేదని వచ్చేసిన చవట సన్నాసు

లందరిమీదా కోపం వచ్చింది. ఆ కుర్చీమీద కూచుని అధికారి అందరి మీదా మండి పడ్డాడు.

అధికారి పెద్ద పులిలాగ గాండ్రించాడు. వసారా సాలలో పాలు తాగు తున్న పెయ్య తాగడంమానేసింది. అడుక్కోడానికి వచ్చిన ముష్టిది అడుక్కో కుండానే పక్క గుమ్మానికి వెళ్ళిపోయింది.

"పొండి. నా ముందు నుంచి పొండి. వెధవ ముఖాలూ మీరూనూ. సన్నాసి వెధవల్లారా వెళ్ళి గంగలో దూకి చావండి. చేతకాని దద్దమ్మలు. ప్రతీదీ చెప్పాలా. వెళ్ళి ఆ స్టేషన్లోనూ, బస్‌స్టాండులోనూ చూసి రమ్మనమని బొట్టెట్టి చెప్పాల్రా మీకు. పొండి. అవన్నీ వెతికి రండి."

అధికారం ఎర్రగా, కణ కణ మండుతున్న చింత నిప్పులా, తుపాకీ గుండు కక్కిన కాగిన రక్తపు బొట్టులా భయంకరంగా, అసహ్యంగా అధికారి కళ్ళ చుట్టూ.

సేవకుడూ, అతని లాంటి అరిగిపోయిన సన్నకారు మనుషులూ పిడుగు పడితే చెదిరినట్టు చెదిరిపోయారు. తలొక దిక్కు పట్టుకుని పరుగెత్తారు. బస్సు స్టేండులో, రైలు స్టేషన్లో పకడ్బందీగా వెతికి వుత్త చూపుల్తో అధికారి దగ్గరకొచ్చి చేతులు కట్టుకున్నారు.

అధికారి అందర్నీ పంపించేసి సేవకుడ్ని ఒకడ్నీ వుండమన్నాడు. సేవకుడు బోనస్ అందుకున్నంత సంబర పడిపోయాడు.

"ఒరేయ్ ! ఒకసారి అలా వెళ్ళి మన తోటలో నూతిలోనూ, అవతల చెరువులోనూ చూసిరా. పనిగట్టుకుని వెళ్ళినట్టు వెళ్ళబోక. ఏదో అలా పోతూ తొంగిచూసినట్టుగా చూసి త్వరగా వచ్చేసెయ్."

సేవకుడు, ఆ రెండేకాదు యింకో అరడజను నూతుల్ని కూడా చూసొచ్చాడు.

అదికారికి ఏం చెయ్యాలో తోచలేదు. నూతుల్లోనూ, చెరువులోనూ లేక పోయినందుకు మాత్రం కాస్తంత స్థిమిత పడినవాడిలాగ పడక్కుర్చీలో జార

బడి బుర్ర గోక్కున్నాడు. తిరుపతి వెంకట రమణుడి పరమైపోయిన పాతిక తల నీలాలలోనూ రెండు ఆ స్వామి వారికి చెందకుండా వూడిపడ్డాయి.

అధికారికిఅపరాధం తెలిసొచ్చింది. గదిలోకి పోయి.రహస్యంగా లెంపలు వాయించుకున్నాడు. ఆ తర్వాత అరుగుమీద వున్న పడక్కుర్చీని గదిలో వేయించుకున్నాడు. గది కిటికీ కాస్త ఎత్తులో వుంది అందువల్ల అందులో జారబడ్డప్పుడు అధికారి బయటికి కవిపించేవాడు కాదు. జారబడకుండా అటూ యిటూ తిరుగుతున్నప్పుడు మాత్రం కటకటాల వెనక ఏ పెద్దపులో పచార్లు చేస్తున్నట్టు వుండేది బయటి వాళ్ళకి.

అయిదు రోజుల తర్వాత అధికారి అరుగు మీదికి వచ్చాడు. ఆ రోజు వుత్తరం వచ్చింది. సమయానికి అందుకునే వాళ్ళెవరూ లేక తనే వచ్చి తీసుకున్నాడు. తీసుకుని మళ్ళీ గదిలోకి వెళ్ళిపోయి చదువుకున్నాడు. చదువుకుని ఎప్పుడెప్పుడు సేవకుడు వస్తాడా, వుత్తరాలు కొనుక్కురమ్మనమని పంపిద్దామా అని ఎదురు చూస్తూ కూచున్నాడు.

ఎప్పుడూ సూర్యుడు రాకుండానే వచ్చే సేవకుడు ఈ రోజు సూర్యుడొచ్చి నెత్తికెక్కి కూచున్నా యింకా రాలేదు!

అధికారికి కోపం వచ్చింది. ఎంత కోపం వచ్చిందంటే సేవకుడ్ని పని లోంచి తీసిపారెయ్యకుండా అతగాడి జీతం తీసిపారెయ్యాలన్నంత కోపం వచ్చింది. మరొకరెవర్నో పంపించి వుత్తరాలు తెప్పించుకున్నాడు. సేవకుడ్ని వున్నవాడ్ని వున్న పళంగా లాక్కురమ్మన్నాడు.

సేవకుడు ఇంట్లో లేడు.

సాయంకాలం లబో దిబో మంటూ పరుగెత్తుకొచ్చాడు.

వాడి వాలకం ఏమాత్రం తిన్నగా లేదు. పొట్లకాయలాగ వొంకర తిరిగిపోయి వొళ్ళంతా దుమ్ము పట్టేసి వుంది. చెవ్వులు మట్టి కొట్టుకు పోయాయి. నడుం మరీ వొంగిపోయింది.

"బాబుగోరో! అది నా కొంప నిలువునా కూల్చేసినాదండి బాబో. పొద్దు టేల లేసేతలికే కనిపిచ్చలేదండి టేషనూ, బస్సుటేండూ అన్నీ సూసొత్తన్నాను. పాడుముండ, నన్ను నట్టేట్లో ముంచేసింది బాబుగోరు"

'ఎవర్రా ?' అన్నట్టు చూశాడు అధికారి.

"ఇంకోరు బాబో. నాకూతురేండి. ఎంత పని సేసిందో సూడండి"

అధికారికి నవ్వొచ్చి కోపం కొట్టుకు పోయింది. జోకర్‌ని చూసినట్టు చూసి "సర్లే వెళ్ళు. వెళ్ళి, రేపు కూడా ఎగనామం పెట్టకుండా పొద్దున్నే తగలడు" అన్నాడు.

సేవకుడు పదోసారి మళ్ళీ వూరంతా తిరిగాడు. స్టేషనూ, బస్సుస్టేండూ చూశాడు. నూతుల్లోనూ, చెరువుల్లోనూ మాత్రం చూళ్ళేదు. అమ్మాయిగారు పెట్టిన వరవడిలోనే కూతురుకూడ నడిచి వుంటుందనే విషయం సేవకుడికి తెలియక పోలేదు. అందుకే వొంటెద్దుబండి ఎంకన్ననీ, గుర్రబ్బండి కరీమ్‌నీ, బస్సు డ్రైవర్లు అప్పారావు. చంద్రయ్యల్ని, క్లీనరు సూరిగాడ్ని వాకబు చేశాడు. ఆ సాయంకాలం వరకూ తిరిగిన చోటే తిరిగాడు.

అలసిపోయిన సేవకుడు సిమ్మాద్రికొట్టు బల్లమీద ఓనిమిషంకూచుని చుట్ట కాల్చుకుందామని పొగాక్కాడలు ఓపావలావి తీసుకుని యీనెలు వలుస్తున్నాడు.

కొట్టు పక్క సన్నాసిగాడి సైలరుషాపులో ఏమిటో సందడిగా వుంది. కోఆపరేటివ్ సొసైటీ గుమాస్తా సుబ్బన్న పేపరు పట్టుకుని హడావుడి చేస్తున్నాడు.

"చూశారా! నిజంగా ఆదర్శ వివాహం అంటే మన సత్తిరాజుగారి అమ్మాయిదే. లేకపోతే ఆ పురుషోత్తంగారి అబ్బాయి శంకరాన్ని రిజిష్టర్ మేరేజి చేసుకుందంటే ఏమంటారు మరి. లక్షలకు పడగెత్తిన ఆ సత్తిరాజు గారెక్కడ? ఎర్రని ఏగానీలేనిఅవురుషోత్తం గారెక్కడ? అసలు ఆపురుషోత్తం గారికి ఆస్థి ఏముందంట? ఇల్లు కూడా తనఖాలోవుంది. సొసైటీలో తీసుకున్న అప్పు సంగతి – సరే సరి – అదంతా యిప్పుడు ఎందుగ్గాని నిలువెల్లా ఐశ్వర్యం

లో మునిగి వుండి ఏమీలేని ఆ పురుషోత్తంగారి అబ్బాయిని పెళ్ళాడిందంటే ఆ అమ్మాయిది ఎంత దొడ్డ బుద్ధో ఆలోచించారా. ఎంత ఆదర్శం ఆమెది? అదేనయ్యా లౌ మేరేజి అంటే అదే మరి, చూడండీ– పేపర్లో బంధు మిత్రులకు అభినందనలు తెలుపుతూ ఫోటో వేయించుకున్నారు.''

సేవకుడు ఫోటో చూద్దామనుకున్నాడు గాని అక్కడ మూగిన వాళ్ళు కుక్కల్లాగ పేపరుమీదికి ఎగబడేసరికి సేవకుడు ఓ నిమిషం చూచి, ఇంటికి ఆ వార్త మోసుకు పోదామన్న సంబరంలో కూతురు కనిపించలేదన్న మాటే పట్టించుకోక, పొగాకొట్టడలకి డబ్బివ్వలేదన్న విషయమే మర్చిపోయి హడావిడిగా బైలుదేరాడు,

అలా వెళ్ళిపోతోన్న అతన్ని బండ బూతుతో మేకు దిగేసి నిలేసినట్టు నిలేశాడు. పొగాకొట్టు సిమాద్రి.

ఆ బూతు తిట్టుకి సుబ్బన్న యిటు తిరిగి చూసి "సిమాద్రిగారూ ఆడు యిప్పుడు మనలో లేడు లెండి. ఆడికూతురు పొద్దున్నే దేశాటనకి బైలుదేరింది. ఆడూ, ఆడి పెళ్ళాం పొద్దుట్నించి కాళ్ళరిగి పోయేలా తిరుగుతున్నారు. ఆడి పిచ్చిగానీ యింకెక్కడ అది కనిపిస్తుంది, ఎప్పుడో వుడాయించేస్తేను. ఆడికి ఖర్చు మిగిల్చేసి ఎవడితోనో లేచి పోయివుంటుంది. దాని తప్పేమీ లేదు లెండి. ఆడిదే తప్పంతాను. ఎద్దులా అన్నేళ్ళొచ్చినా పెళ్ళి చేద్దామన్న ఆలోచనన్నా ఆడికి లేకపోయిందికదా. తగిన శాస్తే చేసింది లెండి ఎదవకి."

సేవకుడు ఏదో అనగాలనుకున్నాడు. అతనికి తన నడుం పడిపోయినట్టు చాలా కాలం క్రితమే తెలిసొచ్చిందిగాని యిప్పుడు నోరు కూడా పడిపోయినట్టు అర్థమైంది. అందుకే అతను ఏమి మాట్లాడలేక పోయాడు.

———